రాయిని చెక్కి.. జీవం పోసి



రాయితో తయారు చేసి దేవత విగ్రహాలు



విగ్రహాన్ని చెక్కుతున్న భాస్కర్

- అద్భుత శిల్పాలు చెక్కుతున్న కుంబోజి భాస్కర్
- వివిధ రాష్ట్రాల నుంచి ఆర్డర్లు

ఇచ్చోడ: రాయిని మలిచి జీవం పోస్తూ.. అద్భుత శిల్పాలను చెక్కుతున్నాడు కుంబోజి భాస్కర్. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని అడే గామ(కె) గ్రామానికి చెందిన భాస్కర్ తన తండ్రి కుంబోజి రమణయ్య వారసత్వంగా నేర్చుకున్న కళను కొనసాగిస్తూ.. రాళ్లకు జీవం పోస్తూ.. ప్రతిభ కనబరుస్తున్నాడు. వీరి ఇద్దరు చెక్కిన వేలాది విగ్రహాలు ప్రస్తుతం నిత్యపూజలు, నీరాజనాలు అందుకుంటున్నాయి. రాళ్లకు జీవం పోస్తూ.. అందమైన కళాఖండాలను తీర్చిదిద్దడంలో దిట్ట.

దేవతామూర్తుల విగ్రహాలు..

అంజనేయడు, సీతారామ లక్ష్మణుడు, శివ పార్వతులు, నంది, శివలింగాలు, గ్రామ దేవతలు, బ్రహ్మంగారు, అంబేడ్కర్, కుమురం భీం, ఇందిరాగాంధీ, వినాయకుడు ఇలా అనేక రకాల విగ్రహాలు తయారు చేస్తున్నాడు. ఎలాంటి ఆర్డర్ ఇచ్చిన అచ్చుగుద్దినట్లు తయారు చేసి, నిర్వాహకులకు అందిస్తున్నాడు.

వేల విగ్రహాలు తయారీ..

భాస్కర్ రాయితో చెక్కిన విగ్రహాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఆయా రాష్ట్రాల వారు విగ్రహాల తయారీకి భాస్కర్‌కు ఆర్డర్ ఇస్తారు. ఫొటోలో ఉన్నట్లుగా దేవతల విగ్రహాలను తయారీ చేసి అందిస్తాడు. ఒకొక్క విగ్రహం తయారీకి కనీసం నెల రోజుల సమయం పడుతుంది.

విగ్రహాలను బట్టి ధర...

ఒకొక్క విగ్రహానికి ఒక్కో ధర ఉంటుంది. మూడు అడుగుల అంజేయుడు విగ్రహం రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు ఉంటుంది. కొంచెం పెద్ద విగ్రహాలు రూ. 40 నుంచి రూ. 50 వేల వరకు ధర ఉంటుంది. ప్రస్తుతం విగ్రహాల తయారీకి వినియోగించే రాయి కూడా దొరకడం చాలా కష్టంగా మారిందన్నారు. భూమిలో నుంచి తవ్వి తీసి, దాదాపుగా 30 కిలోమీటర్ల దూరం నుంచి తీసుకురావడం ఇబ్బందిగా ఉందన్నారు.

ప్రభుత్వం గుర్తింపునివ్వాలి

కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం గుర్తింపునివ్వాలి. ఎంతో శ్రమపడి విగ్రహాలు తయారు చేస్తూ కళను బతికిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం మాలాంటి పేద కళకారులకు గుర్తింపు ఇచ్చి అన్నివిధాలుగా ఆదుకోవాలి.

– కుంబోజి భాస్కర్, శిల్ప కళాకారుడు

‘గెలుపే లక్ష్యంగా పనిచేయాలి’



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

సాత్నాల: స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని సలాయితండాలో నిర్వహించిన చేరికల కార్యక్రమం పాల్గొన్నారు. సైద్‌పూర్, సలయితండా, పలైతండా, సాస్‌తండాలకు చెందిన దాదాపు 90 మంది గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సంతోష్ రావు, కుండ గంగాధర్, సామ రుపేష్ రెడ్డి, ప్రశాంత్, భువనగిరి సంతన్న, అల్‌చెట్టి నాగన్న, మోహన్, ఏనుగు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

రెడ్డి కులస్తులు ఉన్నతంగా ఎదగాలి

కైలాస్‌నగర్: రెడ్డి కులస్తులు అన్నిరంగాల్లో రాణించాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రెడ్డిసంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన రెడ్డిల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన రెడ్డి అభ్యర్థులు, పదోన్నతులు పొందిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆయన శాలువాలతో సత్కరించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, సంతోష్ రావు, సామ రూపేష్ రెడ్డి, కొండా గంగాధర్, ప్రశాంత్, డేరా కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేరడిగొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. టెంబి మాజీ ఎంపీటీసీ సిడం భీంరావు, మాజీ సర్పంచ్ దిగంబర్ జాదవ్‌తో పాటు ఆత్రం గోపాల్, పెందుర్ మారుతి, సిడం సురేశ్, ఆత్రం రాంపాల్, అలాగే సొనాల మండలంలోని గుట్టపక్కతండా గ్రామస్తులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మర్రి దేవన్న, యోల్కర్ దూదే రావు, రట్టే దినేష్, కిరణ్, నిస్తేగురు, ఆడే జనార్దన్ పాల్గొన్నారు.

ఆదివాసీలకే జెడ్పీ చైర్మన్ పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న ఉయిక విష్ణు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ చైర్మన్ పదవి ఆదివాసీలకే ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతంలో రిజర్వేషన్ నిలుపుదల చేయాలన్నారు. భద్రాద్రి, కొమురంభీం జిల్లాల జెడ్పీ చైర్మన్ కూడా ఎస్టీలకే కేటాయించాలన్నారు. ఇటీవల ప్రకటించిన జిల్లా పరిషత్ రిజర్వేషన్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. సమావేశంలో నాయకులు తనుష్, నాగోరావు, ఆత్రం కిష్టన్న, సక్కు, భీంరావు, మాణిక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయం ప్రారంభిస్తున్న యువకులు

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె)లో ఆదివారం గ్రామయూత్ ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన యువకులు గ్రంథాలయం ఏర్పాటు కోసం ముందుకు వచ్చి ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. గ్రంథాలయం విద్యార్థులకు, నిరుద్యోగులు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదివారం ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఇచ్చోడ పట్టణ ఆరే మరాఠ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాదవ్ సాయికిరణ్, ప్రధాన కార్యదర్శిగా పొడే అనిల్, ఉపాధ్యక్షుడిగా పాన్‌పట్టి సుభాష్, షిందే పరమేశ్వర్, థోరే తానాజీ, జాయింట్ సెక్రటరీలుగా కదం చంద్రకాంత్, దుక్రే శ్యాం, గైక్వాడ్ దినేష్, కదం శంకర్, కోశాధికారిగా గైక్వాడ్ జ్ఞానేశ్వర్, లక్ష్మణ్, పబ్లిసిటీ సెక్రటరీగా జాదవ్ రాము, ఆర్గనైజర్ సెక్రటరీలుగా లాండ్గే సాయి, పాన్‌పట్టి శుభం, దుక్రే సుమిత్, సభ్యులుగా పాన్‌పట్టి సాయికృష్ణ, గాడ్గే జ్ఞానేశ్వర్, కదం సందీప్, చౌహాన్ అశోక్, సూర్యవంశీ అక్షయ్, బోసలే శివ, తదితరులను ఎన్నుకున్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న హరీశ్‌రాథోడ్

నార్నూర్: డీహెచ్ఆర్ చారిటెబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని గంగాపూర్‌లోని పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చారిటెబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డిగాంబర్ హరీశ్‌రాథోడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో విద్య, వైద్యం అభివృద్ధి చేసేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు అందించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దిసిక రాథోడ్, రజిత, శ్రీనివాస్ రాథోడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశం వాయిదా

కైలాస్‌నగర్: ఈనెల 6న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరగాల్సిన ఆదిలాబాద్ రూరల్, సాత్నాల, మావల మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. తనకు హైదరాబాద్‌లో అత్యవసర సమావేశం ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేసినట్లుగా పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ఆలయం వద్ద షెడ్డు నిర్మించాలి

నేరడిగొండ: భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద షెడ్డు నిర్మించాలని బోథ్ మండలం కన్గుట్ట గ్రామ వీడీసీ సభ్యులు కోరారు. బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు.

పేకాటాడుతున్న పలువురిపై కేసు

బేల: మండలంలోని కాప్సి(బి) రెవెన్యూ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం జైనథ్ సర్కిల్ సీఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి పక్కా సమాచారం రావడంతో దాడి చేసి పది మందిని పట్టుకున్నారు. ఈ దాడిలో పేక ముక్కలతో పాటు రూ.8,410నగదు, 5 సెల్‌ఫోన్‌లను సీజ్ చేశామన్నారు.

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆదివారం పక్కా సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 15,900 నగదు, మూడు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అవాంఛనీయ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాచారం అందించే వారి వివరాలు గోప్యం ఉంచడం జరుగుతుందని ఎస్సై రాధిక తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకురాలిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌లో బెల్టుషాపు నిర్వహిస్తున్న మహిళ గులే ఇంద్రపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఇంటి వద్ద బెల్టుషాపు నిర్వహిస్తుండగా తనిఖీ చేపట్టి, రూ.1300 విలువ గల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

తలమడుగు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటాలని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రుయ్యడి, కుచులాపూర్, ఆర్లీ గ్రామాల్లో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ.. జెడ్పీటీసీ అభ్యర్థితో పాటు ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అధికారంలో ఉన్న పార్టీ గెలుపునకు ప్రజలు మొగ్గు చూపుతారని ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, రమేశ్‌రెడ్డి, సోమన్న, నారాయణ, లక్ష్మణ్ యాదవ్, మల్కు పటేల్, రఫిక్, సాబశివ్, తదితరులు పాల్గొన్నారు.

‘జెడ్పీటీసీ టికెట్ ఎస్సీ వర్గానికే ఇవ్వాలి’



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలో అన్ని రాజకీయ పార్టీలు జెడ్పీటీసీ టికెట్‌ను ఎస్సీ వర్గానికే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంబ్లే బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో జెడ్పీటీసీ రిజర్వేషన్ బీసీలకు ఇవ్వడం జరిగిందన్నారు.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు రాజకీయం ఎదగలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పులేటి శీను మాదిగ, అందారే బాలాజీ, జాదవ్ తానాజీ, మల్యాల సుందర్ పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని కాపాడేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి



మాట్లాడుతున్న జిల్లా ప్రచార ప్రముఖ్ శ్రీనాథ్

తాంసి: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ ప్రముఖ్ శ్రీనాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని కప్పర్ల రామాలయంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా దసరా పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచారక్ నరేందర్, జిల్లా ధర్మ జాగరణ్ ప్రముఖ్ పోశెట్టి, ఆలయ పూజారి విశాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు

బోథ్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, బోథ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక దుర్గా కమిటీ ప్రాంగణంలో ఆదివారం విజయదశమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి సంఘ్ కార్యకర్తలు, స్వయం సేవకులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్య అతిథిగా సురేశ్‌జోషి, నిమ్మల ప్రతాప్ రెడ్డి- విభాగ్ సంఘచాలక్ హాజరయ్యారు. వక్త బలవత్రి గణేష్ మాట్లాడుతూ.. భారతదేశం పరాయి పాలనలో ఎదుర్కొన్న కష్టాలను, వాటి నుంచి గట్టెక్కడానికి, ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించడానికి గల కారణాలను వివరించారు.

భవిష్యత్‌లో సేవలు వినియోగించుకుంటాం



అశోక్ దంపతులను సన్మానిస్తున్న జగదీష్

ఆదిలాబాద్‌రూరల్: ఉద్యోగ విరమణ పొందిన టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సంద అశోక్ సేవలను భవిష్యత్‌లో వినియోగించుకుంటామని టీఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్ అన్నారు. ఆదివారం మావల మండల కేంద్రంలోని చిలుకూరిలక్ష్మి గార్డెన్‌లో నిర్వహించిన ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంఏ ముజీబ్, నవీన్ కుమార్, తిరుమల రెడ్డి, సుమన్, చంద్రశేఖర్, ప్రవీణ్ కుమార్, శ్రీహరి, రామ్మోహన్, ప్రభాకర్, కుడాల రవి, శేఖర్, రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి 96వ జయంతి వేడుకలను ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌజింగ్ బోర్డులో గల మాల సంక్షేమ సంఘ భవనంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ మాట్లాడుతూ.. స్వర్గీయ వెంకట స్వామి మాలలకు ఎన్నో హక్కులను సాధించి పెట్టారని, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి సుధాకర్, మేకల మల్లన్న, సురం భగవాండ్లు, సింగరి అశోక్, పాశం రాఘవేంద్ర, రాళ్ల బండి శంకర్, చిలుక పొచ్చన్న, తొగరి ప్రకాష్, పొచ్చన్న, సంటి రవి, బుచ్చిబాబు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

బోథ్: మండలంలో కురిసిన భారీ వర్షాలు, అడవి పందుల బెడద కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే ఎకరాకు రూ. 25,000 చొప్పున పరిహారం చెల్లించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పత్తి, సోయా, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎలుక రాజు, మల్లెపూల సుభాష్, ప్రవీణ్, సోలంకి సత్యనారాయణ, కనక అమతరావు, కనక కేశవ్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించండి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బ్రహ్మానంద్

భీంపూర్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ అన్నారు. ఆదివారం మండలంలోని అందరబండ్, కరంజి గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాజు, మండల అధ్యక్షుడు అంకం అశోక్, ప్రధాన కార్యదర్శి నారాయణ, వెంకటేశ్, రాకేశ్, రమేశ్, గంగన్న, భోజన్న, అనిల్, సంజీవ్, సురేశ్, అమత్‌రావు, సన్నిత్ రెడ్డి, సోమేశ్వర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఆదరించాలి

బోథ్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఆదరించాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సొనాల మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేయాలని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిని తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు భీంరావు పాటిల్, రాథోడ్ రాయల్, లంక లలిత, తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో వీధికుక్కల బీభత్సం

బోథ్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం అర్ధరాత్రి వీధికుక్కలు స్వైర విహారం చేశాయి. ఈ దాడిలో లేగదూడ తీవ్రంగా గాయపడిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. బోథ్ గ్రామానికి చెందిన రైతు జక్క నవీన్‌కు చెందిన లేగదూడ మార్కెట్ యార్డు ప్రాంతంలో ఉండగా.. కుక్కల గుంపు దాడి చేసి గాయపరిచాయి. సమాచారం అందుకున్న వెంటనే పశువైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన దూడకు చికిత్స అందించారు. స్థానికులు మాట్లాడుతూ.. వీధి కుక్కలు తరచుగా పశువులు, జంతువులపై దాడులు చేస్తున్నాయని వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి, కుక్కల బెడద నుంచి ప్రజలను, పశువులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వర్ధంతి సభ విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నార్నూర్: కుమురం భీం వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సంతోష్ పిలుపునిచ్చారు. ఆదివారం గాదిగూడ మండలం లోకారి(కె)లో కుమురం భీం చౌరస్తా వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. జోడేఘాట్‌లో నిర్వహిస్తున్న వర్ధంతి సభకు ఆదివాసులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఆత్రం విజయ్, జైతు పటేల్, జంగు, భారత్, నాగోరావు, దేవురావు, చందు, మోహన్, బాపురావు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలి



మాట్లాడుతున్న రవీందర్

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాతల మాదిరిగా మన రాష్ట్రంలోనూ ఈ చట్టం తీసుకువస్తే అమాయక ప్రజలు బలి కాకుండా ఈ చట్టం రక్షిస్తుందన్నారు. భవిష్యత్‌లో చేసే కార్యక్రమాలపై తీర్మానం చేశారు. జిల్లా అధ్యక్షుడు దండ నాయక ఉమాకాంత్, పెన్టపర్తి ఊషన్న, లింగారెడ్డి, సంతోష్ కుమార్, గంగన్న, శ్రీధర్ బాబు, ఆత్రం సంతోష్, మెస్రం రాజు, అమిత్, నాయక్, నర్సయ్య పాల్గొన్నారు.

నిన్న బీఆర్‌ఎస్‌లో.. నేడు కాంగ్రెస్‌లో చేరిక



తిరిగి కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలు

తాంసి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పార్టీలలో చేరికలు, జంపింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. నిన్న ఒక పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు తెల్లారితే వేరే పార్టీలోకి జంప్ అవుతున్నారు. దీంతో నాయకులు తలలు పట్టుకుంటున్నారు. తాంసి మండలంలోని వడ్డాడికి గ్రామానికి చెందిన పది మంది కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకొని బీఆర్‌ఎస్‌లో చేరారు. మళ్లీ 24 గంటలోపు తమ సొంత పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ మండల కన్వీనర్ కొడాల నారాయణ, శ్రీధర్ రెడ్డి సమక్షంలో ఆదివారం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డుకు మరమ్మతు

భీంపూర్: మండలంలోని కోజాన్‌గూడ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో ఆదివారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. పనులను గ్రామ పెద్దలు పరిశీలించారు. ఉయికె యాదవ్, మడవి జైవంత్ రావ్, నైతం సంజీవ్, పుర్కా శ్రీకాంత్, ఉయికే తులసి రామ్, పెందూర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బోథ్: మండలంలోని పిప్పలధరి గ్రామంలో ఇటీవల జరిగిన సిలిండర్ గ్యాస్ లీకైన ఘటనలో తొడసం బాపురావు, తొడసం లక్ష్మణ్, సోనేరావు కుటుంబసభ్యులు గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన కుటుంబాలకు మాజీ సర్పంచ్ బండారి శ్రీధర్ రెడ్డి సోదరి ఉపాధ్యాయురాలు అనిత ఆదివారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు.

విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

బోథ్: సొనాల మండలంలో నిర్మించ తలపెట్టిన ఆశ్రమంలో 45 అడుగుల ఆది యోగి శివుడి విగ్రహం నిర్మాణానికి ఆదివారం యోగా గురూజీ శాంతి దూత్ శ్రీ నరేంద్ర బంధుజీ శంకుస్థాపన చేశారు. డాక్టర్ కర్తార్ సింగ్ చౌహాన్ ఉదారంగా విరాళంగా ఇచ్చిన 10 ఎకరాల భూమిలో శంకుస్థాపన చేశారు. దీనిని పర్యవేక్షించడానికి 12 మందితో గల ట్రస్ట్ ఏర్పాటు చేశారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన అంకిత

భీంపూర్: మండలంలోని అంతర్గావ్ గ్రామానికి చెందిన గుండ ప్రకాష్, వందన దంపతుల కుమార్తె అంకిత ఇటీవల జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో గ్రామస్తులు ఆమెను అభినందించి సన్మానించారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం పరామర్శించారు. పలు కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

స్థానిక ఎన్నికలకు సీపీఐ సన్నద్ధం

బోథ్: వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉందని సీపీఐ నాయకులు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన చరిత్ర సీపీఐదన్నారు. సమస్యల పరిష్కారాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని ఎన్నికల బరిలోకి దిగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ

బోథ్: రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపుమేరకు దేశంలో ఓటు చోరీ విధానాన్ని నిరసిస్తూ.. సొనాల మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 'ఓట్ల చోరీ విధానం' నశించాలని, దేశంలో ప్రతీ పౌరుడి ఓటుహక్కు సురక్షితంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.